పశువుల సంతపై పట్టింపేదీ !

- విక్రయదారుల నుంచి అక్రమ వసూళ్లు
- ఇరుకు వాహనాల్లో పశువుల రవాణా
- మందుబాబులకు అడ్డాగా మారిన సంత


కోదాడ పశువుల సంత

కోదాడ : ఒకప్పుడు రాష్ట్రంలోనే అతిపెద్ద పశువుల సంతగా పేరున్న కోదాడ పశువుల సంత నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అయినప్పటికీ పట్టించుకోవాల్సిన వ్యవసాయ మార్కెట్ శాఖ అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిస్తున్నాయి. దీంతో చీకటి పడితే సంతలో మందుబాబులు వీరంగా సృష్టిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇక సంతలో జరితే దందాకు గస్తీకి వెళ్తున్న కొందరు అక్కడి వారితో దోస్తీ చేస్తున్నారనే పలువురు ఆరోపిస్తున్నారు.

అక్రమ రవాణా అడ్డుకోకుండా..

కోదాడ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ధాన్యం కొనుగోళ్లు ఏనాడు జరగవు. కేవలం అక్కడ ప్రతి ఆదివారం పశువుల సంత నిర్వహిస్తారు. అయితే కొంతకాలంగా అక్కడకు పశువుల రాక కూడా బాగా తగ్గిపోతూ వస్తోంది. శనివారం వట్టిపోయిన పశువులను విక్రయిస్తుంటారు. సాధారణంగా పశువులను రవాణా చేయడానికి అనేక నిబంధనలున్నా ఇక్కడ మాత్రం పట్టించుకునే వారు కరువయ్యారు. ఆరోగ్యంగా ఉన్న పశువులను సైతం వట్టిపోయిన వాటిగా చూపి ఇరుకు వాహనాల్లో కుక్కి రవాణా చేస్తుంటారు. ఆదివారం విక్రయానికి వచ్చే వారి నుంచి మామూళ్ల వసూళ్లు చేయడానికి, పశువుల అక్రమ రవాణా అడ్డుకోకుండా ఉండడానికి కొందరిని నియమించుకొని డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మందుబాబులకు అడ్డాగా..

కోదాడ వ్యవసాయ మార్కెట్ స్థలం దాదాపు 25 ఎకరాలకు పైగా ఉంది. దీనిలోనే సంతను నిర్వహిస్తారు. ఇది పట్టణం మధ్యలో ఉండడంతో పాటు దీనికి అనుకొని మద్యం దుకాణం ఉంది. దీంతో పలువురు సంతను మద్యం సేవించడానికి వేదికగా వాడుకుంటున్నారు. సంతకు రెండు గేట్లు ఉన్నప్పటికీ వాటిలో ఒకటి ఎప్పుడు తీసే ఉంచడంతో పాటు చుట్టూ ఉన్న ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండడంతో మందుబాబులు గోడ దూకి లోనికి సులువుగా వస్తున్నారని సమాచారం. రాత్రి సమయంలో మద్యం సేవించి ఖాళీ సీసాలను అక్కడే పగలగొడుతుండంతో పశువుల కాళ్లకు గుచ్చుకుంటున్నాయని రైతులు వాపోతున్నారు.

నూతన కమిటీనైనా గాడిలో పెట్టేనా..

కోదాడ వ్యవసాయ మార్కెట్‌కు సంవత్సరానికి 4 నుంచి 5 కోట్ల రూపాయల ఆదాయం మార్కెట్ సెస్ రూపంలో వస్తుంది. ప్రతి ఆదివారం జరిగే పశువుల విక్రయం, గొర్రెల, మేకల అమ్మకాలపై కూడా ఆదాయం వస్తుంది. ఇక్కడ ధాన్యం కొనుగోళ్లు జరగకపోవడంతో అధికారులకు దమ్మిడి పని లేదని, వారు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు పోతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందని పలువురు రైతులే అంటున్నారు. వారం క్రితమే నూతన కమిటీని నియమించారు. వీరైనా సంత కార్యకలాపాలపై దృష్టి సారించి గాడిలో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

సిమెంట్ బెంచీల ఏర్పాటు


వైద్యశాలలో బెంచీలు ఏర్పాటు చేస్తున్న హరికిషన్ మిత్రమండలి సభ్యులు

కోదాడ : మునగాలకు చెందిన జర్నలిస్టు చిల్లంచర్ల హరికిషన్ జ్ఞాపకార్థం ఆయన మిత్రమండలి సభ్యులు శనివారం కోదాడ ప్రభుత్వ వైద్యశాల, కోదాడ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణ, మునగాల పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయంలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రాధాకృష్ణమూర్తి, మిత్రమండలి సభ్యులు గుడుగుంట్ల శంకర్, తోట రంగారావు, వంగవీటి పుల్లయ్య, యాదా లక్ష్మీనారాయణ, నంబూరి నాగేశ్వరరావు, అర్వపల్లి శ్రీనివాసరావు, అడ్వకేట్ ఈదుల కృష్ణయ్య, రహీం, బాలయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో జయ విద్యార్థుల ప్రతిభ


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్

కోదాడ : న్యూఢిల్లీకి చెందిన సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ గత నెలలో నిర్వహించిన నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలో కోదాడకు చెందిన జయ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండవ లెవల్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వేణు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి విద్యార్థి ఎస్‌కె. జాహిద్, 8వ తరగతి నుంచి ఆర్.వరుణ్ సందేశ్‌రెడ్డి, 9వ తరగతి నుంచి మనస్విని, 10వ తరగతి నుంచి ఏ.వేద అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కరస్పాండెంట్ జయవేణుగోపాల్, డైరెక్టర్లు పద్మ, జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.

వాసవీ క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం


పాల్గొన్న ఆర్యవైశ్య ప్రముఖులు

మునగాల : మండల కేంద్రంలోని వాసవీ భవన్‌లో శనివారం వాసవీ క్లబ్ గ్రేటర్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వంగవేటి వెంకటగురుమూర్తి సమక్షంలో ఘనంగా జరిగింది. అధ్యక్షుడిగా అర్వపల్లి ప్రవీణ్, కార్యదర్శిగా కందిబండ సంతోష్, కోశాధికారిగా బ్రహ్మదేవర అఖిల్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పోతుగంటి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య ప్రముఖులు అర్వపల్లి శంకర్, పెనుగొండ చలపతి, పీవీడీ.ప్రసాద్, చల్ల కిరణ్, చక్కా కిశోర్, శ్రీనివాస్, దినేష్, నరేష్ పాల్గొన్నారు.

ఈ- పంచాయతీ ఆపరేటర్‌కు సావిత్రిబాయి పూలే అవార్డు


సాయిలక్ష్మిని సన్మానిస్తున్న ఎంపీడీఓ లావణ్య తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో ఈ- పంచాయతీ ఆపరేటర్‌గా పనిచేస్తూ పదేళ్లు పూర్తి చేసుకున్న ఆపరేటర్ సాయిలక్ష్మికి ఈనెల 3న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సావిత్రిబాయి పూలే అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సాయిలక్ష్మిని ఎంపీడీఓ లావణ్య, అధికారులు సన్మానించారు. సూపరింటెండెంట్ జోగు శ్రీనివాసరెడ్డి, ఏఈఈ మౌనిక, టైపిస్టు నాగాంజనేయులు పాల్గొన్నారు.

బీపీఎంపై చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరం బీపీఎంపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన వృద్ధాప్య పింఛన్‌దారులు ఉప్పెల గురువారెడ్డి, షేక్ మస్తాన్ కోరారు. ఈమేరకు శనివారం హుజూర్‌నగర్‌లోని పోస్టాఫీస్ మేనేజర్‌కు పలువురు పింఛన్‌దారులతో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అమరవరంలో పింఛన్‌దారులకు ప్రతినెల రూ.2016, రూ.4016 చెల్లించాల్సిన బీపీఎం మంగతా 6 నెలలుగా పై రూ.16 ఇవ్వకుండా బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని వారు తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా ఇళ్లు పంపిణీ చేయాలి

నేరేడుచర్ల : ఇందిరమ్మ ఇళ్లను రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను అన్నారు. శనివారం నేరేడుచర్లలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3500 కాకుండా 10 వేల ఇళ్లు కేటాయించాలని కోరారు. పార్టీ నాయకులు అల్వాల శ్రీధర్, చలసాని అప్పారావు, బుడిగ ధనుంజయ, సైదులు, విలోచనారాణి, శ్రీనివాస్, వెంకటయ్య, ఉన్నారు.

సనా కళాశాలకు న్యాక్ బీప్లస్ గ్రేడ్


మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ నజీరుద్దీన్

కోదాడ రూరల్ : కోదాడ పట్టణ శివారులోని సనా ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ బీప్లస్ గ్రేడ్ లభించింది. కళాశాలలో గత రెండేళ్లుగా న్యాక్ బృందాలు తనిఖీలు నిర్వహించి కళాశాలలోని విద్యా ప్రమాణాలు, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, అధ్యాపకుల అర్హతలు, వసతి సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించి ఈ గ్రేడ్ ప్రకటించినట్లు కళాశాల చైర్మన్ ఎండీ.నజీరుద్దీన్, కళాశాల డైరెక్టర్ నౌమన్ తెలిపారు. తమ కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం పట్ల హర్షిస్తూ శనివారం కళాశాలలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్‌ఎస్.ప్రసాద్, టీపీఓ నాగేందర్, న్యాక్ కోఆర్డినేటర్లు ఎం.సురేష్, ఎండీ.జానిపాషా, ఎస్.నాగరాజు, జ్యోతిర్మయి, రఫియా, సుల్తానా, సమియోద్దీన్, ఏజాజ్ హాస్మీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు లేబర్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ


లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

నేరేడుచర్ల : పట్టణంలో రాజీవ్‌గాంధీ బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సంఘంలో పని చేస్తున్న కార్మికులకు శనివారం మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి లేబర్ ఇన్సూరెన్స్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు తప్పనిసరిగా లెబర్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నేరేడుచర్ల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు సన్నెపంగ శ్రీను, ప్రధాన కార్యదర్శి సందీప్, కోశాధికారి ఇంజమూరి మల్లయ్య, కార్యవర్గ సభ్యులు పున్నయ్య, బండ నగేష్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి


లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, తదితరులు

చిలుకూరు : మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గిరిబాబు, ఎంఈఓ గురవయ్య మాట్లాడుతూ.. చూపులేని దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. అనంతరం బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్, రామారావు విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

మునగాల : మండలంలోని విజయరాఘవపురంలో శనివారం అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు రెమిడాల లింగయ్య అధ్యక్షతన సమావేశమైన సభ్యులు సంఘం అధ్యక్షుడిగా కత్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పగడాల మునీందర్, సొంపంగు సాయికిరణ్, కత్తినాగయ్య, ప్రధాన కార్యదర్శిగా రెమిడాల రాజేష్, కార్యదర్శిగా సొంపంగు వినోద్, సహాయ కార్యదర్శిగా కత్తి వెంకన్న, ప్రచార కార్యదర్శిగా రెమిడాల రవితేజ, సంయుక్త కార్యదర్శిగా రెమిడాల రాజు, కోశాధికారిగా కొత్తపెల్లి సర్వయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కత్తి కోటయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు కత్తి వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సాయిరామ్, చీమ కమలాకర్, సొంపంగు హరికృష్ణ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికురాలికి సన్మానం


మధ్యాహ్న భోజన కార్మికురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : మధ్యాహ్న భోజన కార్మికులకు ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన వంటల పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికురాలు మంగమ్మను శనివారం ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. అనంతరం జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, ఉపాధ్యాయులు సైదులు, రషీద్‌ఖాన్, అన్నపూర్ణ, నర్సింహారావు, మాధవి, నాగమణి, బానుమతి, వెంకట్‌రెడ్డి, రామ్మూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, విజయలక్ష్మి, సరస్వతి తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయాలి

మునగాల : ఎస్సీ వర్గీకరణ అమలుకు హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే లక్ష డప్పులు.. వేయి గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కళానాయకుల కవాతు కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉప్పుల నాగార్జున పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని బరాఖత్‌గూడెంలో గల కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య అధ్యక్షతన జరిగిన కళాకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మాదిగ కళామండలి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా జిల్లేపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా యాంపంగ వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా కిన్నెర జనార్దన్, సహాయ కార్యదర్శిగా వేముల రాజేష్, కోశాధికారిగా కత్తి నాగయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల నాగరాజు, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు లంజేపల్లి శ్రీను, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య, పెద కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

గరిడేపల్లి : మండల కేంద్రంలో వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల కార్యక్రమ మండల కమిటీని శనివారం జిల్లా ఇన్‌చార్జ్ కోట వీరస్వామి, మండల ఇన్‌చార్జ్ మంద భిక్షం, పిచ్చయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా గోపాల్‌దాస్ వీరబాబు, మండల మహిళా అధ్యక్షురాలిగా చిలక సంధ్య, ఉపాధ్యక్షురాలిగా రాణిని ఎన్నుకున్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఎంఈఓ శ్రీనివాసరావు ఆవిష్కరించారు. నాయకులు వెంకటరమణ, ఓరుగంటి నాగేశ్వరరావు, వీరేంద్రవర్మ, ఎస్ సురేష్, బాలు, శ్రీనివాస్, క్రాంతికుమార్, కళావతి, నరేష్, శాంత కుమారి, వనజ, అన్వర్‌పాషా, జగ్గు నాయక్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

భోజన సౌకర్యం కల్పించాలని అన్నదానం కమిటీల తీర్మానం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల అన్ని కులాల అన్నదాన సత్రం కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, సభ్యులు స్థానిక రెడ్డి సత్రంలో శనివారం సత్రం అధ్యక్షుడు సాముల వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా త్వరలో మట్టపల్లిలో జరిగే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులకు సత్రాలలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం సౌకర్యం కల్పించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కమిటీలు సత్రాల అభివృద్ధికి సహకరించుకోవాలని తీర్మానించారు. ఈ సమావేశంలో హుజూర్‌నగర్ మాజీ సర్పంచ్ గొటెంట రామయ్య యాదవ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఎం.ఎం.యాదవ్, సత్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు అమ్మితే చర్యలు తప్పవు

- డీఏఓ శ్రీధర్‌రెడ్డి


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

హుజూర్‌నగర్: ఎరువులను ఎంఆర్‌పీ కన్నా అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని డీఏఓ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం డీలర్లతో సమావేశమై మాట్లాడారు. నిబంధనలు అతిక్రమించిన దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్, సొసైటీల ద్వారా అందుబాటులో ఉన్న యూరియాను వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రవి, ఎంఏఓ స్వర్ణ, డీలర్లు పాల్గొన్నారు.

నేడు మోతె మండలంలో ఎమ్మెల్యే పద్మావతి పర్యటన

మోతె : మండలంలో ఆదివారం ఎమ్మెల్యే నలమాద పద్మావతి పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రూ. 5 కోట్ల వ్యయంతో సర్వారం నుంచి రావిపహాడ్ ఆర్ అండ్‌బీ రోడ్డు వరకు బీటీ రోడ్డు, సర్వారం నుంచి రామునితండా వరకు బీటీ రోడ్డు, రావికుంట తండా నుంచి రాందాస్ తండా వరకు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మండలంలో 38 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేయనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన


చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న టీచర్, తదితరులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా 6 నెలల చిన్నారి గోధుమల దేవాన్ష్‌కు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆకుల రజిని, చిన్నారి తల్లి మౌనిక, ఆయా ఉమ, రాధ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు


అవార్డు గ్రహీత హెచ్‌ఎం జయవాణీదేవిని సన్మానిస్తున్న ఎంఈఓ సైదానాయక్, తదితరులు

హుజూర్‌నగర్ : ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు అని ఎంఈఓ సైదానాయక్ అన్నారు. శనివారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి సావిత్రిబాయి పూలే అవార్డును స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం జయవాణి దేవికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి బీరెల్లి శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్‌ఎంలు నలబోలు శ్రీనివాసరెడ్డి, పెనుగొండ శ్రీనివాస్, జవహర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

హుజూర్‌నగర్ : మంత్రి జోక్యం చేసుకొని సివిల్ సప్లయ్ హమాలీల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు బానోత్ సైదులు, జక్కుల మల్లయ్య, గోపి, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్యాలయానికి కరెంట్ కట్

- పదకొండు వందలు బిల్లు కట్టని అధికారులు
- పది రోజులుగా సరఫరా నిలిపివేత

కోదాడ : పట్టణంలోని సహాయ కార్మిక అధికారి కార్యాలయానికి సంబంధించిన కరెంట్ బిల్లు చెల్లించకపోవంతో పదిరోజులుగా కరెంట్ కట్ చేశారు. ఆశ్చర్యమేంటంటే కరెంట్ బిల్లు కేవలం పదకొండు వందలు మాత్రమే. ఈ బిల్లును కూడా కట్టలేక.. కరెంట్ కట్ చేసే వరకు కూడా అధికారులు పట్టించుకోలేదు. మరి ప్రభుత్వ కార్యాలయమే కదా.. బిల్లు కూడా స్వల్పంగానే ఉంది కదా.. అని కరెంట్ కట్ చేయకుండా విద్యుత్ అధికారులు కూడా ఆగలేదు. దీంతో గడిచిన పది రోజులుగా వివిధ పనులపై సదరు కార్యాలయానికి వస్తున్న కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలలోని కార్మికులకు తిప్పలు తప్పడం లేదు. కంప్యూటర్ పని చేయడం లేదని అక్కడి సిబ్బంది తిప్పి పంపిస్తున్నారు. అధికారులు కరెంట్ బిల్లు చెల్లించి సదరు కార్యాలయం పని చేసే విధంగా చూడాలని కార్మికులు కోరుతున్నారు.

రోడ్డుభద్రతపై వాహనదారులకు అవగాహన


అంతర్ రాష్ట్ర చెక్ పోస్టు వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాజ్‌మహ్మద్

కోదాడరూరల్ : జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం వద్ద గల అంతర్ రాష్ట్ర రవాణశాఖ చెక్ పోస్టు ఆవరణలో వాహనదారులకు ఎంవీఐ రాజ్ మహ్మద్ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు, పాఠశాలల బస్సుల డ్రైవర్లు, వస్తువులను రవాణా చేసే వాహనాల డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. ప్రతి ఒక్క వాహనదారుడు తమ వాహనానికి సంబంధించి ధృవపత్రాలు తమ వెంటే ఉంచుకోవాలని కోరారు. అనంతరం వాహనాల డ్రైవర్లచేత భద్రత నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏవీఎంఐ సాయిప్రసాద్, కానిస్టేబుళ్లు చిన్ని, బాబు, దేవేందర్, జానకిరామ్, హోమ్‌గార్డులు కొండలు, కార్యాలయ సిబ్బంది సైఫుద్దీన్, రాజ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలి


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మునగాల సీఐ రామకృష్ణారెడ్డి

మునగాల : ప్రతి విద్యార్థి క్రమశిక్షణ అలవరుచుకొని సమయపాలన పాటిస్తూ భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని మునగాల సీఐ బి.రామకృష్ణారెడ్డి కోరారు. మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి నుంచి 12వ తరగతి వరకు వివిధ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన వారికి ఆయన శనివారం ప్రశంసాపత్రాలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కోదాడ కేఆర్ఆర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఓరుగంటి రవి, పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్య గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర ఫల పుష్పార్చన


శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో ఫల పుష్పార్చనలో పాల్గొన్న మహిళలు


రామాలయంలో హనుమంతు సేవలో భక్తులు

హుజూర్‌నగర్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయంలో శనివారం సహస్ర ఫల పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల పండ్లు, పూలు, గాజులను తెచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మవారికి సమర్పించారు. ప్రాతఃకాలంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, పాశురం పటించారు. పూజారులు, పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రామాలయంలో హనుమంతు సేవ

హుజూర్‌నగర్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం హనుమంతు సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను హనుమంత వాహనంపై ఉంచి భక్తులే బోయిలుగా మారి ఆలయ ప్రదక్షిణం గావించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి


10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీని ప్రారంభిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని వాసవీ క్లబ్ సభ్యులు అన్నారు. శనివారం నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వాసవీ క్లబ్ డిస్ట్రిక్ హెల్త్ క్యాంపు చైర్మన్, సోమప్ప దేవాలయం మాజీ చైర్మన్ రాజకొండ శ్రీనివాస్‌రావు జన్మదినం సందర్భంగా అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మాదిరిగానే శ్రీనివాస్‌రావు తన పుట్టినరోజు సందర్భంగా రూ. 10 వేలు ఇవ్వగా విద్యార్థులకు మూడు నెలల పాటు అల్పాహారం అల్పాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కందిబండ శ్రీనివాస్‌రావు, కొత్త లక్ష్మణ్, ఊట్కూరు నటరాజ్, ఉప్పల పుల్లయ్య, కె.వెంకటేశ్వర్లు, కట్ట పరశురాములు, టి.నవ్య, జి.కవిత, డి.శ్రీనివాస్, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళలకు విద్య కోసం సావిత్రిబాయి కృషి

హుజూర్‌నగర్ : దేశంలో మహిళలకు విద్య కోసం సావిత్రిబాయి పూలే కృషి చేశారని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవర మల్లీశ్వరి అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని వారోత్సవాలలో భాగంగా శనివారం హుజూర్‌నగర్‌లో భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ లలిత, బండి ప్రమీల, సమాఖ్య పట్టణ కార్యదర్శి యల్లావుల ఉమ, లలిత, రజిత, రేష్మ, భూమిక, శ్రీలత, గీత, రమ, మౌనిక, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

9న పేరెంట్స్ సమావేశం

నేరేడుచర్ల : ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు మొట్టమొదటి సారిగా ఈనెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పేరెంట్స్ సమావేశం నిర్వహించనున్నట్లు నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరై సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

10న కబడ్డీ అసోసియేషన్ కమిటీల ఎన్నిక

చిలుకూరు : చిలుకూరు, అనంతగిరి మండలాల కబడ్డీ అసోసియేషన్ హడహక్ కమిటీల ఎన్నికను ఈనెల 10వ తేదీన ఆయా మండల కేంద్రాల్లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ హడహక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కమిటీ జిల్లా చైర్మన్, కన్వీనర్ భూలోకరావు, కర్తయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన కబడ్డీ క్రీడాకారులు ఈ ఎన్నికలో పాల్గొని నూతన కమిటీలను ఎన్నుకోవాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో నాగలింగంకు మంజూరైన రూ.20 వేల సీఎం సహాయ నిధి చెక్కును శనివారం మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అందజేశారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ జనరల్ సెక్రటరీ యరగాని నరసింహారావు తదితరులున్నారు.

ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని వినతి

గరిడేపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో గరిడేపల్లి గ్రామ సర్పంచ్ రిజర్వేషన్ ఎస్సీకి కేటాయించాలని జై భీమ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. ఈమేరకు శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. బరిగల విజయ్‌కుమార్, రేవూరి సాయికిరణ్, శేఖర్, మాచర్ల వెంకటేశ్వర్లు, పిట్ట నాగరాజు, నాగార్జున, నవీన్, రాము పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం చైర్మన్‌కు సన్మానం

మఠంపల్లి : మండలంలోని గుర్రంబోడు ఎత్తిపోతల పథకం నూతన చైర్మన్ రమావత్ నాగునాయక్‌ను, ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్‌ను ఎత్తిపోతల పథకం పరిధిలోని రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్, మేరమ్మాయాడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎత్తిపోతల పరిధిలో నిర్విరామంగా సాగునీరు అందించేలా కృషి చేయాలని నాగునాయక్‌ను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంటిపులి శ్రీనివాస్, భాస్కర్‌నాయక్, తుల సీరాంనాయక్, రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు మాళోతు భీముడునాయక్, రాయసెల్, ఎత్తిపోతల పథకం డైరెక్టర్లు చెన్నానాయక్, బోడ్యానాయక్, రామారావునాయక్, స్వామి, యాంకు, బాల, మోహన్, నరసింహ, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

పది ఎకరాల లోపే రైతు భరోసా ఇవ్వాలి

మునగాల : ప్రభుత్వం రైతు భరోసా ఈనెల 14 నుంచి అమలు చేయాలని నిర్ణయించడం హర్షణీయమని, పది ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకే రైతు భరోసా ఇవ్వాలని నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని ఎక్స్ వేదికగా కోరారు. బీడు భూములు, భూస్వాములకు, ఐటీ చెల్లించే వారికి ఈ పథకం అమలు చేయొద్దని, కౌలు రైతులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి న్యాయం చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.